టైగర్ ఆలే నరేంద్రకు ఘన నివాళి


ఆలే నరేంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బల్మూరి రంగారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్, ఆల్విన్ కాలనీ నరేంద్ర పార్కులో బుధవారం దివంగత నేత, టైగర్ ఆలే నరేంద్ర 11వ వర్ధంతి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు బల్మూరి రంగారావు నరేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు పుట్టా శివశంకర్ నేత, వెంకటేష్‌గౌడ్, కుమార చారి, నరసింహారావు, ఆర్‌కే చారి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జెండా ఆవిష్కరణ



ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించిన గూడెపు నాగరాజు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కూకట్‌పల్లి ఎఎస్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బస్టాప్‌లో ఏర్పాటు చేసిన జెండాను కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూడెపు నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌రెడ్డి, వంశీ, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాలానగర్ ప్రధాన రహదారిలో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బాలానగర్ సీఐ నరసింహరాజు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం బాలానగర్ అధ్యక్షుడు దొంతిరి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. వీరేందర్ రెడ్డి, కోశాధికారి ఇ. మహేందర్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధరను తగ్గించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారంగా పెంచి ప్రజలపై భారం మోపుతుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి.సత్యం, దేవదానం, డి. కరుణాకర్, రావుల స్వాతి, జి వెంకన్న, భాష దుర్గనాయక్, యాదవరెడ్డి, నర్సింహులు, గోపి, సాదులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆర్‌డీఓ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం రంగారెడ్డిజిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఆర్‌డీఓ కె వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కె వెంకారెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ భూముల వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు కూడా తెలిసింది.

రాజ్యాంగాన్ని అవమానిస్తే సహించం



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయమని, రాజ్యాంగంలో మార్పులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డు నెంబర్ 1లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కాలనీలోని రమ్యా గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీత రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కార్యక్రమ ఇన్‌చార్జి ఉజ్మా షకీల మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. మహాత్మాగాంధీని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ని అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షకులుగా ఉండాల్సిన మోదీ రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికి తీసుకెళతామన్నారు. సంవత్సరం పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బ్లాక్ అధ్యక్షుల పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దుండగుల యాదిగిరి, పుష్పరెడ్డి, ప్రతాప్ రెడ్డి, డివిజన్‌ల అధ్యక్షుల, బ్లాక్ మహిళా, డివిజన్‌ల అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


వరద కాలువ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పగుడాల శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులను, హబీబ్‌నగర్, శక్తి నగర్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన వరద కాలువ పనులను బుధవారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు ప్రారంభించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వర్షపు నీటి కాలువలోని పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన హబీబ్‌నగర్, శక్తి నగర్లలో చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను కేటాయించటం జరిగిందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, జైరాజ్, అశోక్, యాదుల్, ఖదీర్, రషీద్, నాయుడు, భాస్కర్‌రావు, బందెప్ప, ఎల్లేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న బొల్లు శ్రీనివాసరావు తదితరులు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, వైకుంఠ ధామం, మంచినీరు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో పాటు ఆయా శాఖ అధికారులతో త్వరలో సమావేశమై సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తంగం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవూరి మధుసూదనాచారి, మాజీ అధ్యక్షులు రోణంకి జగన్నాథం, సభ్యులు సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కూకట్‌పల్లి: కూకట్ పల్లి నియోజక వర్గ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక నాయకులతో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు సురేందర్ రెడ్డి, కేపీహెచ్‌బీ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతమ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జి. రమేష్, పిట్ల మనోహర్, కొత్తూరి రమేష్, డివిజన్ అధ్యక్షులు ఎర్ర స్వామి, కిరణ్‌కుమార్, మహిళా నాయకలు శివరంజని, శ్రీలత, రూప తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

చెట్ల కొమ్మల తొలగింపు


పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్ మెయిన్ రోడ్డులో చెట్ల కొమ్మల కారణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు కార్పొరేటర్ సబీహా బేగం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ రాకేష్, ఫారెస్ట్ అధికారులతో సమస్యను వివరించి చెట్టు కొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డివిజన్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో బల్లు శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, తుంగం శ్రీనివాసరావు, నవులూరి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరి గుట్ట డీఐగా నరేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అంజయ్యను రాజేందర్‌నగర్ ఎస్‌ఓటీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో సైబర్ క్రైమ్స్‌లో పని చేస్తున్న నరేందర్‌రెడ్డిని డీఐగా నియమించారు. పేట్‌బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సుంకర విజయ్‌ను చందానగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. అయన స్థానంలో సైబర్ క్రైమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్ పేట్‌బషీరాబాద్ డీఐగా నియమించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని, సంబంధిత పోలీస్‌స్టేషన్లలో బదిలీ అయిన అధికారులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

పోలీస్ అధికారులకు సన్మానం


జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎస్ఐ రాజేష్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ఆల్విన్‌కాలనీ: శ్రీరామనవమి శోభయాత్రలో బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుంగా చర్యలు తీసుకున్న జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎస్ఐ రాజేష్‌లను ఆల్విన్‌కాలనీ హిందూ రాష్ట్ర సమితి సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో శాలువాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు వెంకటస్వామి రెడ్డి, బల్మూరి రంగారావు, చారి, రామరాజు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

నిజాంపేట్ : ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహన్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను కాపాడాలని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన డివిజన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

హెచ్‌సీయూలో చిత్ర ప్రదర్శన

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రధాన గేటు వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫొటో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. జంతువులు, పక్షులు, పాములు, నీటి వనరుల కేంద్రాలు, వృక్ష సంపద, పచ్చదనం చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి ఆయుష్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ జంతువుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

సంతకాల సేకరణకు స్పందన

హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ చేపట్టిన మాస్ సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద విద్యార్థులు, ఉద్యోగులు, ఇతరులు హెచ్‌సీయూ భూముల రక్షణకు మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. సంతకాల సేకరణ పూర్తయ్యాక భారత రాష్ట్రపతిని కలిసి అందిస్తామని నాయకులు తెలి పారు. పలువురు ఏబీవీపీ హెచ్‌సీయూ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మురుగు నీటికి అడ్డుకట్ట వేయండి


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: స్థానిక బాలాజీనగర్ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్, ముల్లకత్వ చెరువు దగ్గర నూతనంగా కోర్టు భవన నిర్మాణ సమయంలో అంబేడ్కర్ నగర్‌లోని డ్రైనేజీ ఔట్‌లెట్ కూరుకు పోవటంతో కాలనీలో ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేకు బుధవారం ఆమె ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎండీ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రవి ఇంట్లో భోజనం చేస్తున్న బండి రమేష్ తదితరులు

బాలానగర్: పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం ఆయన సన్నబియ్యం లబ్ధిదారుడు బాలానగర్‌కు చెందిన రవి ముదిరాజ్ ఆహ్వానం మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డితో కలిసి రవి ఇంటిలో సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో పుష్పరెడ్డి, శ్రీకాంత్ పటేల్, శివకుమార్ గౌడ్, మధుసూధన్, లక్ష్మయ్య, శివ చౌదరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

12న శ్రీ వీర హనుమాన్ విజయయాత్ర


సీతారాములకు పూజలు చేస్తున్న జీవన్ తదితరులు

మూసాపేట: మూసాపేటలోని శ్రీ పాపనాశేశ్వర స్వామి ఆలయంలో బుధవారం విశ్వహిందు పరిషత్ రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భజరంగ్‌దళ్ కో కన్వీనర్ జీవన్ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ రాముని ఆదర్శంగా తీసుకుని, ఆయన గుణగణాలను అందరూ పాటించాలన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న శ్రీ వీర హనుమాన్ విజయయాత్రలో భాగంగా గౌలిగూడ మార మందిరం నుంచి తాడ్‌బండ్ హనుమాన్ మందిరం బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు, మూసాపేట నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ ప్రతినిధులు డా. వంశీరెడ్డి, బీజేపీ వివి నగర్ డివిజన్ అధ్యక్షులు సుదర్శన్, కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో పాల్గొన్న ఏసీపీ హనుమంతరావు తదితరులు

బాలానగర్: హనుమాన్ జయంతిని శాంతి యుత వాతావరణంలో నిర్వహించుకోవాలని బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు అన్నారు. బుధవారం ఆయన ఈ నెల 12న జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీతో బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు మాట్లాడుతూ పరిమితికి మించిన శబ్దంతో కూడిన సౌండ్ బాక్స్‌లు వాడకూడదన్నారు. డీజేలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనుమతుల కోసం నిర్వాహకులు ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన వారికి సైబరాబాద్ పోలీస్ తరఫున బందోబస్తు కల్పిస్తామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, సరితా రెడ్డి, సరళ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన 50 మంది నాయకులు మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఉమా నాయక్, పెంటేజ్ ముదిరాజ్, బాలు యాదవ్ తదితరులకు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అయిన భారతీయ జనతా పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలంతా భారతీయ జనతా పార్టీని విశ్వసిస్తున్నారని మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మూసాపేట డివిజన్ అధ్యక్షుడు ఎర్ర స్వామి మాట్లాడుతూ పార్టీలోకి చేరిన వారందరికీ గుర్తింపు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు బుధవారం బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న వేడుకల నేపథ్యంలో బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐదుగురు రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు బాలానగర్ పీఎస్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నమని, వారిపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని సూచించారు. తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు.భవిష్యత్తును, కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని పద్ధతి మారాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాంనారాయణ్, సరితా రెడ్డి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

రాయదుర్గం: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ కె.సత్యనారాయణ సూచించారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారి నరేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు గణేష్‌పటేల్, హన్విరెడ్డి, ఎస్ఐలు రాములు, నాగరాజు, డాక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపల్ సృజన్‌రావు పాల్గొన్నారు.

రోడ్డుపై గులాబీలతో అవగాహన

మల్కంచెరువు ముందున్న పాత ముంబాయి జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి ఏసీపీ సత్యనారాయణ, ఎస్‌కేవై అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ తదితరులు గులాబీలను అందించారు. విధిగా హెల్మెట్ వాడాలని, కారులో సీటుబెల్టు ధరించాలని సూచించారు.